## 26న రాజ్యాంగ దినోత్సవం : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవం జరపాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. జిల్లా అధికారులు తమ కార్యాలయాల్లో ఈ కార్యక్రమం జరపడంతో పాటు తమ పరిధిలోని క్షేత్రస్థాయి కార్యాలయాల్లోనూ ఆరోజు ఉదయం 11 గంటలకు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాజ్యాంగ పీఠికను చదివి వినిపించాలన్నారు. కలెక్టరేట్‌లో జరిగే కార్యక్రమానికి కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది ఉదయం 10.30 గంటలకు తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు.

# రైల్వేను ప్రయివేటీకరణ చేయొద్దు

- ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి
- రైల్వే స్టేషన్ల వద్ద సిఐటియు ఆధ్వర్యాన నిరసనలు

ప్రజాశక్తి -విజయనగరం టౌన్, బొబ్బిలి

రైల్వే రంగాన్ని ప్రయివేటీకరణ చేయొద్దని, ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, పాసింజర్ రైళ్లు, జనరల్ బోగీలు పెంచాలని, రాయితీలను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యాన గురువారం విజయనగరం, బొబ్బిలి రైల్వే స్టేషన్ల వద్ద ధర్నాలు చేపట్టారు. ఈ సందర్భంగా సి ఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.శంకర్రావు, కె.సురేష్ మాట్లాడుతూ దేశంలో అతి చౌకయిన ప్రయాణం, సరుకుల రవాణా చేస్తున్న భారత రైల్వేల ధ్వంసానికి, లక్షల కోట్ల రైల్వే ఆస్తులను కార్పొరేట్లకు కట్టబెట్టడానికి బిజెపి ప్రభుత్వం పూనుకుందని అన్నారు. 400 రైల్వే స్టేషన్లు, 90 ప్రయాణీకుల రైళ్ళు, 14 వేల కిలోమీటర్ల రైల్వే ట్రాకు, రైల్వే స్టేడియంలు, రైల్వే కాలనీలు, గూడ్స్ షెడ్‌లు ఇలా మొత్తం విలువ రూ.1,62,496 కోట్లు నగదీకరణ కోసం ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వాలని మోడీ ప్రభుత్వం కంకణం కట్టుకుందని తెలిపారవు. .రైల్వే స్టేషన్ల చుట్టు పక్కల వున్న స్థలాలను ఆదానీ, అంబానీలకు నామమాత్రపు లీజుకు కట్టబెడుతోందన్నారు.

విజయనగరం స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, కార్యకర్తలు

లాభాలొచ్చే 150 రైల్వే రూట్లు కార్పొరేట్లకిచ్చి, లాభాలు రాని గ్రామీణ ప్రాంత రూట్లను మూసెయ్యడమే వారి లక్ష్యమన్నారు. ప్రయాణీకుల భద్రత, రైల్వే లైన్ల భద్రత, మెయింటెనెన్స్ ఇక గాలిలో దీపాలేనన్నారు. రైల్వేల ప్రైవేటీకరణ విధానాల వల్లే తరుచుగా రైలు ప్రమాదాలు జరిగి ప్రయాణికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి రైలు ప్రమాదాలు రెట్టింపయ్యాయని అన్నారు. ఇటీవల ఒరిస్సాలోని బాలాసోర్ వద్ద మన రాష్ట్రంలోని విజయనగరం జిల్లా కంటకాపల్లి వద్ద జరిగిన రైలు ప్రమాదాలు సిగ్నలింగ్ వ్యవస్థ,ట్రాక్ మెయింటెనెన్స్ నిర్వహణ సరిగా లేకపోవడం, సేఫ్టీ విభాగాలను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడం, భద్రతా ప్రమాణాలు సరిగ్గాపాటించనందువల్లే జరిగాయని అన్నారు. ఈనేపథ్యంలో రైల్వేలను ప్రైవేటీకరణ బారి నుండి రక్షించుకోవటానికి, అన్ని ఉద్యోగ, కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు, రైల్వేలోని ఉద్యోగ సంఘాలు, ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ధర్నాల్లో విజయనగరంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి, నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎ.జగన్ మోహన్, బి.రమణ, నగర ఉపాధ్యక్షులు ఆర్.శంకర్‌రావు, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ, గోపి, రాఘవ, కాలనీ నాయకులు రమణ, బొబ్బిలిలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం, పెన్షనర్ సంఘం జిల్లా అధ్యక్షులు వి. శేషగిరి, టి.రమణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : రైల్వేస్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, కార్యకర్తలు

# రెండు పోలీసు స్టేషన్లు అప్‌గ్రేడ్

- భోగాపురం, ఎస్.కోటకు అవకాశం
- ఎస్ఐ స్థానంలో స్టేషన్ హౌస్ ఆఫీసర్లుగా సిఐలు
- జిఒ విడుదల చేసిన ప్రభుత్వం

ప్రజాశక్తి- భోగాపురం

రాష్ట్ర వ్యాప్తంగా 45 పోలీస్‌స్టేషన్లను అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఇటీవల జిఒ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఇందులో మన జిల్లాకు చెందిన భోగాపురం, ఎస్‌కోట పోలీస్ స్టేషన్లను అప్‌గ్రేడ్ చేయనున్నట్లు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకు స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా ఎస్ఐ ఉండేవారు. ఇక నుంచి సిఐ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా కొనసాగనున్నారు. ఈ మేరకు సంబంధిత జిఒను జారీ చేసింది. ప్రస్తుతం భోగాపురం సర్కిల్ పరిధిలో భోగాపురం, డెంకాడ, పూసపాటిరేగ మండలాలు ఉండేవి. ఇటీవలి కాలంలో నెల్లిమర్లను కూడా ఈ సర్కిల్‌లోకి కలిపారు. నాలుగు మండలాలతో కలిపి సర్కిల్ కార్యాలయంగా కొనసాగుతోంది. అయితే ఇటీవలి అంతర్జాతీయ విమానాశ్రయానికి శంకుస్థాపన జరగడంతో పాటు నిర్మాణ పనులు శరవేగరంగా జరుగుతున్నాయి. అంతేకాక త్వరలో సిఎం క్యాంప్ కార్యాలయం కూడా విశాఖకు తరలివస్తుండడంతో విశాఖకు ఆనుకొని ఉన్న భోగాపురంపై ప్రత్యేకంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇదివరకు ఎస్.ఐ కేసులు నమోదు చేసేవారు ఇక నుంచి సిఐ కూడా కేసులు నమోదు చేయనున్నారు. భోగాపురం పోలీస్‌స్టేషన్‌కు ఎస్.ఐ, సి.ఐ ఇక్కడే కొనసాగుతారు. ఇక డెంకాడ, నెల్లిమర్ల, పూసపాటిరేగ మండలాలు కలిపి ఒక సర్కిల్‌గా మారుతుంది. నెల్లిమర్ల నియోజకవర్గం కేంద్రం కావడంతో నెల్లిమర్ల పేరు మీద మరో సర్కిల్ కార్యాలయం వస్తుందని అధికారులు అంటున్నారు. ప్రస్తుతం భోగాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బివి. వెంకటేశ్వరరావు ఉన్నారు. ఈయనను ఇక్కడ కొనసాగిస్తారా లేదా కొత్తవారినెవరినైనా నియమిస్తారనేది ఇంకా తెలియాల్సి ఉంది. ఇక ఎస్‌కోట విషయానికొస్తే ఇక్కడ అరకు, పాడేరు వంటి గిరిజన ప్రాంతాలు నుంచి గంజాయి ఎక్కువగా రవాణా జరుగుతోంది. ఇక్కడ ఈ కేసులే ఎక్కువగా నమోదు అవుతుంటాయి. ఇంకా ఇక్కడ పట్టణం అభివృద్ధి చెందుతుండడంతో దీనిని అప్‌గ్రేడ్ చేసినట్లు చెబుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆయా పోలీస్ స్టేషన్లను అప్‌గ్రేడ్ చేసినట్లు కేవలం జిఒ మాత్రమే విడుదల చేసింది. ఇంకా సిఐల నియామకం, మిగిలిన స్టేషన్లను కలుపుకొని కొత్త సర్కిల్ కార్యాలయాలకు సంబంధించిన విధివిదానాలు త్వరలో అధికారులు ఖరారు చేస్తారని చర్చ జరుగుతోంది.

## జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు గుణవర్ధన్

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని మదనాపురం ఎపి రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థి జుత్తాడ గుణవర్ధన్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఆర్. రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు క్రీడాకారుడిని గురువారం పాఠశాలలో అభినందించారు. ఈ నెల 18 నుంచి 21 వరకూ జరిగిన ఎస్‌జిఎఫ్ అండర్ 14 కబడ్డీలో పాల్గొని రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానం సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడని తెలిపారు. ఆ విద్యార్థికి తర్ఫీదు ఇచ్చిన పీడీ రాధను తోటి ఉపాధ్యాయులు, హెచ్‌ఎం అభినందించారు.

విద్యార్థి గుణవర్ధన్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

# వైసిపితోనే సామాజిక సాధికారత

బస్సుయాత్ర సభలో పంచాయతీరాజ్‌శాఖా మంత్రి ముత్యాలు నాయుడు

ప్రజాశక్తి-బొబ్బిలి

బిసిలు, ఎస్, ఎస్‌టిల సంక్షేమానికి వైసిపి ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చిన సామాజిక సాధికారత సాధిస్తుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖా మంత్రి బూడి ముత్యాలు నాయుడు అన్నారు. సామాజిక సాధికార బస్సుయాత్ర సభకు వచ్చిన జనాన్ని చూస్తే బొబ్బిలి విజయం వైసిపికే సొంతమని అన్నారు. వైసిపి చేపట్టిన సామాజిక సాధికార బస్సుయాత్ర సభ గురువారం సాయంత్రం శ్రీకళాభారతి జంక్షన్ లో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ గత పాలకులు నియోజకవర్గ ప్రజలను మోసం చేస్తే వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతోందని అన్నారు. 25 మంత్రి వర్గ స్థానాల్లో 17 వెనుకబడిన వారికి ఇచ్చారని చెప్పారు. మళ్లీ మోసపోకుండా రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని కోరారు. మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించేందుకు అమ్మఒడి అమలు చేస్తున్నట్లు చెప్పారు. కార్పొరేట్ విద్యను ప్రభుత్వ విద్యా సంస్థలలో అందించేందుకు నాడు-నేడు అమలు చేస్తున్నామన్నారు. జిల్లా

సభలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బూడి ముత్యాలునాయుడు

పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన రాజులు నియోజకవర్గానికి ఏమి చేశారని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో రాజులు ఓటు కోసం వస్తే బుద్ధి చెప్పాలని అన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే బొబ్బిలిని రెవెన్యూ డివిజన్ గా చేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు 2014లో అమలు చేయకపోతే వైసిపి ప్రభుత్వం రెవెన్యూ డివిజన్ ఇచ్చిందని చెప్పారు. చెరకు రైతులకు బకాయి బిల్లులు ఇప్పించిన ఘనత వైసిపిదేనని అన్నారు.

ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధి కోసం చేయూత, ఆసరా పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ప్రజలందరికీ వైద్యం అందించేందుకు వైద్య రంగాన్ని ప్రభుత్వం బలోపేతం చేస్తుందని చెప్పారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు మాట్లాడుతూ గత పాలకుల పాలనలో బొబ్బిలి నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిందని చెప్పారు. సభలో మాజీమంత్రి పి.పుష్పశ్రీవాణి, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బడుకొండ అప్పలనాయుడు, అలజంగి జోగారావు, ఎస్‌టి కమిషన్ చైర్మన్ స్వాతీరాణి, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు పరీక్షిత్ రాజు, మున్సిపల్ చైర్మన్ సావు మురళి, శంబంగి వేణుగోపాలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## ఆకలి తీర్చుతున్న ఫుడ్ బ్యాంకులు

### డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పేదల ఆకలి కష్టాలను తీర్చేందుకు నగరంలో ఏర్పాటు చేసిన ఫుడ్ బ్యాంకులు ఉపయుక్తంగా ఉంటున్నాయని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అభిప్రాయపడ్డారు. గురువారం పోలీస్ బ్యారెక్స్ వద్ద నున్న ఫుడ్ బ్యాంకు వద్దకు చేరుకున్న ఆయన పేదలకు స్వయంగా ఆహారాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ఆరు చోట్ల ఫుడ్ బ్యాంకులను గత రెండేళ్లగా నిరాటంకంగా కొనసాగిస్తున్నామన్నారు. పేద ప్రజలు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి ఆకలి తీరుస్తున్నాయన్నారు. ఎవరైనా శుభకార్యాలు ఇతర ప్రత్యేక దినాల్లో ఆహారాన్ని పేదలకు అందించినట్లయితే మంచిదని అన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పిన్నింటి కళావతి, వైసిపి నాయకులు సూర్యనారాయణ, నారాయణప్పుడు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు పసుపాం విద్యార్థి

**పూసపాటి రేగ:** రాష్ట్ర స్థాయి ఎస్‌జిఎఫ్ అథ్లెటిక్స్ పోటీలకు పసుపాం హై స్కూల్ విథ్యార్థిని జి.లక్ష్మీ ఎంపికయిందనీ ప్రధానోపాధ్యాయులు జి నాగేశ్వరరావు తెలిపారు. ఈ నెల 25 నుండి 27వరుకు నరసరావుపేటలో జరుగు రాష్టస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు హైజంప్‌కు ఎంపికైందనీ తెలిపారు. ఈ నెల 10వ తేదీన జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో హై జంప్‌లో ద్వితీయస్థానం పొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయిందన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినికి పాఠశాల ఉపాధ్యాయులు ఆర్థిక సహాయాన్ని అందించారు. పాఠశాల హెచ్‌ఎం ఆర్.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మహాసభలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

## 16,17 తేదీల్లో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డిసెంబర్ 16,17 తేదీల్లో ఎస్ఎఫ్ఐ 31వ జిల్లా మహాసభలు నెల్లిమర్లలో జరుగుతాయని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సి హెచ్ వెంకటేష్, పి.రామ్మోహన్ తెలిపారు.గురువారం స్థానిక ఎల్ బి జి భవనం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యారంగంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతూ జిల్లాలో విద్యా రంగం అభివృద్ధి కోసం కృషి చేస్తోందని తెలిపారు. విద్యార్థుల చదువుకు ఆటంకంగా మారిన ప్రభుత్వ విధానాలపై ఉద్యమాలు చేస్తోందన్నారు. ఈనేపథ్యంలో ఇప్పటి వరకు చేసిన కార్యక్రమాలను సమీక్షించుకుని భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించుకునేందుకు మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 200మంది ప్రతినిధులు సభలకు హాజరు కానున్నారని, జిల్లాలో గత మహాసభల నుంచి ఇప్పటి వరకు విద్యా రంగంలో వచ్చిన సమస్యలు పరిష్కారం కోసం, విద్యార్థులకు ఎదురయ్యే సమస్యలపై చేసిన పోరాటాలు, విజయాలు, భవిష్యత్తు కర్తవ్యాలపై చర్చించి నిర్ణయాలు చేస్తామని తెలిపారు. జిల్లాలో సరిపడా ప్రభుత్వ కళాశాలలు లేవని, ఉన్న కాలేజీల్లో అనేక సమస్యలు ఉన్నాయని తెలిపారు. జెఎన్‌టియు యూనివర్సిటీ గా మారినప్పటికీ అందుకు సరిపడా నిధులు లేక సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. ప్రభుత్వం విద్యా రంగానికి సరిపడా నిధులు కేటాయించక పోవడం వంటి సమస్యలపై చర్చించి భవిష్యత్ కర్తవ్యాలను రూపొందిస్తామని తెలిపారు. మేధావులు, విద్యా వేతలు, జిల్లా ప్రజలు అన్ని విధాలా సహకరించి మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విలేకర్ల సమావేశంలో నాయకులు రాము, రవి, హర్ష వెంకీ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్‌పి చైర్మన్, ఎమ్‌పి, జెసి

## 21రోజుల్లో ధాన్యం కొనుగోలు చెల్లింపులు

ప్రజాశక్తి-మెరకముడిదాం

ధాన్యం కొనుగోలు చెల్లింపులను ప్రభుత్వం 21 రోజులు లోపు జమ చేస్తుందని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు తెలిపారు. పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం సోమలింగాపురం గ్రామంలో జెడ్‌పి చైర్మన్, ఎంపి బెల్లాన చంద్రశేఖర్ , జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్‌పి చైర్మన్ మాట్లాడుతూ నేటి నుంచి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రం ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియ మొదలుపెట్టిందని తెలిపారు. ధాన్యం కొనుగోలు చెల్లింపులకు ప్రభుత్వం 21 రోజులు లోపు జమ చేయబడతాయని, గడువు ఇచ్చినప్పటికీ వారం రోజుల లోపే చెల్లింపులు జరుగుతాయని అన్నారు. రైతు పండించిన ప్రతి ఒక్క గింజను కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వానిదే అని తెలిపారు.

కార్యక్రమంలో సివిల్ సప్లయి డిఎం మీనా కుమారి, వ్యవసాయశాఖ జెడి రామారావు , మండల వ్యవసాయాధికారి శ్రావణితేజ, ఎంపిడిఒ ఎం.రత్నం, తహశీల్దార్ పి. విజయ భాస్కర్, మండల నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, ఎస్ వి రమణరాజు, కోట్ల వెంకటరావు, పప్పల కృష్ణ, మూర్తి, కెఎస్‌ఆర్‌కె ప్రసాద్, తల చుట్ల హరి బాబు, క్రిష్ణ మూర్తి రాజు, బూర్లె నరేష్ కుమార్ పలువురు పాల్గొన్నారు.

## రీసర్వే పక్కాగా నిర్వహించండి : జెసి

ప్రజాశక్తి- మెరక ముడిదాం

మండలంలో రీ సర్వే ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ మండల అధికారులకు సూచించారు. గురువారం ఆయన స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. మండలంలో జరుగుతున్న రీసర్వే గురించి తహశీల్దార్ విజయభాస్కర్ జెసికి తెలిపారు. కంప్యూటర్‌లో నిక్షిప్తమై ఉన్న వివరాలను జెసి స్వయంగా చూసి తెలుసు కున్నారు.అనంతరం రెవెన్యూ సిబ్బందితో మాట్లాడారు.

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- పూసపాటిరేగ

మండలంలో గోవిందపురం పంచాయతీ భరణికాం గ్రామంలో గురువారం సాయంత్రం విద్యుతా ఘాతంతో రైతు మృతి చెందాడు. గ్రామానికి చెందిన బొచ్చు అప్పలనాయుడు (53) ఎస్ఎంఎస్ పరిశ్రమలో ఎస్ఎంఆర్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. గురవారం సాయంత్రం పొలానికి వెళ్తుండగా, కొబ్బరితోటలో అప్పటికే తెగిపడి ఉన్న విద్యుత్ వైర్‌ను చూసుకోపోవడంతో కాలికితగిలి షాక్‌కు గురయ్యాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పల నాయుడు సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. పొలంలో ఆయన మృత దేహం లభ్యమైంది. ఎస్ఐ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.



అప్పల నాయుడు

## 10న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల మహాసభ

ప్రజాశక్తి-విజయనగరం కోట

వచ్చేనెల 10న రాష్ట్రస్థాయి ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ప్రథమ మహాసభ విజయవాడలో జరగుతుందని కాంట్రాక్ట్స్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (అమరావతి జెఎసి) రాష్ట్ర అధ్యక్షులు సుమన్ తెలిపారు. గురువారం రెవెన్యూ కల్యాణ మండపంలో మహాసభకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మహాసభను విజయవంతం చేసేందుకు పెద్ద ఎత్తున ఔట్సోర్సింగ్ ఉద్యోగులు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగి ఆప్కాస్ ఏర్పాటు చేసినప్పటికీ కనీస వేతనానికి నోచుకోక అనేక ఇబ్బందులు గురవుతున్నారని అన్నారు.

కార్యక్రమంలో అమరావతి జెఎసి జిల్లా ప్రధానకార్యదర్శి భానుమూర్తి, అసోసియేట్ చైర్మన్ విజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షులు జి.మహేంద్ర బాబు, ప్రధాన కార్యదర్శి పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.




చెక్కు అందజేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

## 478 మందికి కల్యాణమస్తు

ప్రజాశక్తి-విజయనగరం

వైఎస్‌ఆర్ కల్యాణమస్తు, వైఎస్‌ఆర్ షాదీ తోఫా పథకం కింద జిల్లాలోని 478 మంది నవ వధువులకు రూ.2కోట్ల, 79 లక్షల 90వేలు విడుదల అయ్యింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా, బటన్ నొక్కినేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో ఈ మొత్తాన్ని జమ చేశారు. కలెక్టరేట్‌లో దీనికి సంబంధించిన చెక్కును జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి లబ్ధిదారులకు అందజేశారు. ఎస్‌సి, ఎస్‌సి, బిసి, వికలాంగులు, ముస్లింలు ఆగస్టు 1 నుంచి అక్టోబరు 31 మధ్య వివాహాలు చేసుకున్న వారికి, ఈ ఏడాది నాలుగో విడత ప్రోత్సాహకం అందించారు. ఎస్‌సిలకు రూ.లక్ష, ఎస్‌సి కులాంతర వివాహాలకు రూ.1.20లక్షలు, ఎస్‌టిలకు రూ.లక్ష, ఎస్‌టి కులాంతర వివాహాలకు రూ.1.2లక్షలు, బిసిలుకు రూ.50వేలు, బిసి కులాంతర వివాహాలకు రూ.75వేలు, మైనారిటీలకు రూ.లక్ష, వికంగులకు రూ.1.5లక్షలు, వెల్ఫేర్ బోర్డులో రిజిష్టర్ చేసుకున్న నిర్మాణ రంగ కార్మికులకు రూ.40వేలు చొప్పున వివాహ ప్రోత్సాహకాన్ని అందిస్తున్నట్లు తెలిపారు.

**అర్హులందరికీ కల్యాణమస్తు**

జిల్లాలోని అర్హులందరికీ వైఎస్‌ఆర్ కల్యాణ మస్తు, షాదీ తోఫా వర్తిస్తుందని డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ పథకానికి సచివాలయాల ద్వారా ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. యువతీ యువకుల్లో విద్యను ప్రోత్సహించడానికి, వధూవరులిద్దరూ పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్న నిబంధన పెట్టారని చెప్పారు బాల్య వివాహాలను నివారించే ఉద్దేశంతో కనీస వయో పరిమితిని వధువుకు 18ఏళ్లు, వరుడికి 21 ఏళ్లు నిండి ఉండాలన్న నిబంధన విధించారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమశాఖాధికారి రామానందం, గిరిజన సంక్షేమాధికారి చంద్రశేఖర్, రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ రౌతు భాస్కరరావు దితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



## నష్టపోయిన వరి రైతును ఆదుకోవాలి

తడిచిన పంటను పరిశీలిస్తున్న రామారావు

**నెల్లిమర్ల:** అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన వరి రైతును ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. మండలంలోని జరజాపుపేట గ్రామంలో గురువారం వర్షంతో తడిసిన వరి పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అకాల వర్షాలు వల్ల వరి పంట తడిసిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. అకాల వర్షంతో 50శాతం పంట కూడా దక్కే పరిస్థితి లేదన్నారు. ఎకరానికి 50వేలకు పైగా ఖర్చు పెట్టిన రైతుకు వర్షాలు కారణంగా పెట్టుబడంతా నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. ఇంతవరకు వర్షాలు కురవక ఇబ్బందులు పడిన రైతుకి ఇప్పుడు అకాల వర్షాల వల్ల తీవ్ర నష్టపోతున్నారన్నారు. పండించిన పంట ఇంటికి వస్తున్న సమయంలో అకాల వర్షం కురిసి రైతుని తీవ్రంగా నాశనం చేశాయన్నారు. ఒక పక్క తెగుళ్ళ ఇంకొక పక్క అకాల వర్షాలె రైతును తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ అధికార్లు తడిసిన వరి పంటను పరిశీలించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించాలి

**బొబ్బిలి:** ప్రజలకు సంపూర్ణ వైద్య సేవలు అందించేలా పని చేయాలని సచివాలయ, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్య సిబ్బందిని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు కోరారు. వైద్య సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి వైద్య పరీక్షలు చేసి వ్యాధులను గుర్తించి వైద్యం అందించాలన్నారు. ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేలా చూడాలని కోరారు. ఆరోగ్యశ్రీ యాప్‌ను ప్రతి ఒక్కరూ మొబైల్‌లో డౌన్‌లోడ్ చేయాలన్నారు. ఆరోగ్యశ్రీ సేవలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఆయుష్మాన్ భారత్ కార్డులకు రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరోగ్యశ్రీ పై అవగాహన కల్పించాలి

**నెల్లిమర్ల:** నగర పంచాయతీలో ఆరోగ్యశ్రీ పథకం పై అవగాహన కల్పించాలని కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్ సూచించారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏఎన్ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులో వైద్య బృందం రిఫర్ చేసిన వ్యాధి గ్రస్తులు హస్పటల్లో ఆరోగ్య శ్రీ పథకం ద్వారా పూర్తి స్థాయిలో చేర్పించేటట్లుగా అవగాహన కల్పించాలన్నారు. వ్యాధి నివారణ జరిగే వరకు తరచూగా తగు పరీక్షలు చేయాలని సూచించారు. నగర పంచాయతీలో ఆరోగ్య శ్రీ యాప్ డౌన్‌లోడ్ చేసుకున్న వారి సంఖ్య తక్కువగా ఉండటం ప్రజలందరికి యాప్ గురించి అవగాహన కల్పించి వాలంటీర్ల ద్వారా ఆరోగ్య శ్రీ యాప్ డౌన్ లోడ్ సంఖ్య పెరిగేటట్లు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాగా ప్రతి శుక్రవారం నగర పంచాయతీ పరిధిలో డ్రై డే డ్రై డే పాటించి వివరాలని వెక్టర్ బోర్న్ యాప్‌లో నమోదు చేసి యాప్‌లోకి వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిశీలించి పూర్తి స్థాయిలో పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు.

## కంటి వైద్య శిబిరానికి స్పందన

**డెంకాడ:** విజయనగరం మండలంలోని ద్వారపూడిలో రాజా సాహెబ్ డాక్టర్ పివిజి రాజు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం పుష్పగిరి కంటి ఆసుపత్రి సహకారంతో ఎంవిజిఆర్ ఎన్ఎస్ఎస్ యూనిట్ నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో సుమారు 52 మంది సభ్యులకు కంటి పరీక్షలు నిర్వహించి 21 మందిని కంటి ఆపరేషన్లకు రిఫర్ చేశారు. ముగింపు వేడుకలలో ఎంవిజిఆర్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వైఎంసి శేఖర్, జెడిపి పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛ బృందం నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీన్, ఎన్ఎస్ఎస్ పిఒ, విద్యార్థులు పాల్గొన్నారు.

## యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

**డెంకాడ :** యుటిఎఫ్ మండల శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక స్థానిక ఎంఆర్‌సి భవనం వద్ద గురువారం జరిగింది. ఈ ఎన్నికల్లో గౌరవ అధ్యక్షులుగా ఏ. ప్రమీల రాణి, అధ్యక్షులుగా ఎస్ చంద్ర రావు, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసరావు, ఎస్ రోజా రమణి, ప్రధాన కార్యదర్శిగా కె శోభన్ బాబు, కోశాధికారిగా ఎం ఆదినారాయణ జిల్లాకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రమేష్ పట్నాయక్, ఎన్నికల అధికారులు కే ప్రసాద్, ఆర్‌పివి సూర్యారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 29 నుంచి ఓటర్ల జాబితా పరిశీలన

**నెల్లిమర్ల:** బిఎల్‌ఒలు ఈ నెల 29 నుంచి ఇంటింటికి వెళ్లి ఓటర్ల జాబితా పరిశీలించాలని తహశీల్దార్ డి. ధర్మరాజు తెలిపారు. గురువారం ఆయన స్థానిక కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ 18సంవత్సరాలు దాటిన యువతీ యువకులను ఓటర్లుగా నమోదు చేయాలని, మృతి చెందిన వారు జాబితాలో ఉంటే వారిని ధ్రువ పత్రం పరిశీలించి తొలగింపు చేయాలని సూచించారు. ఒకే పేరు మీద రెండు చోట్ల ఓట్లు ఉంటే తొలగింపు, డోర్ నంబర్ లేదారుల పరిశీలించి సవరణలు చేయాలని తెలిపారు. వచ్చే నెల 9లోగా ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలోని బిఎల్‌ఒలు చేర్పులు, మార్పులు, సవరణలు పూర్తి స్థాయిలో జరపాలని తెలిపారు.

## 'సీతం'లో అంతరిక్షంలో అద్భుత అవకాశాలు

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జడ్సన్

**విజయనగరం టౌన్:** స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో డిపార్ట్మెంట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో 'అంతరిక్షంలో అద్భుత అవకాశాలు' అనే అంశంపై గురువారం ఒక్కరోజు సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి విశాఖకు చెందిన తారామండల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ కో ఫౌండర్ ఎవినేల్ జడ్సన్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ అంతరిక్ష రంగంలో భారతదేశం దూసుకుపోతుందని, అలాగే రానున్న రోజుల్లో అంతరిక్ష రంగంలో వ్యాపారం ఒక ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అన్నారు. భారత ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు కూడా అంతరిక్ష ప్రయోగాలకు అవకాశం ఇచ్చిందని, ఆ అవకాశాన్ని విద్యార్థులంతా సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ అతి త్వరలో సీతం విద్యార్థులతో ఉపగ్రహం తయారు చేయడానికి, తారామండల్ టెక్నాలజీతో ఒప్పందం కుదుర్చుకు టామని ప్రకటించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి.రామ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.దామోదర్ నాయుడు, ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ విభాగాధిపతి వై.సంతోష్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## మహాసభ జయప్రదానికి ప్రచారం

**వంగర:** మండల కేంద్రంలో ఈనెల 25న జరగనున్న భవన నిర్మాణ కార్మికుల రెండవ మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని సంగాం, ఓని అగ్రహారం, మగ్గూరు, వంగర, శివ్వాం, తలగాం తదితర గ్రామాలలో సిఐటియు ఆధ్వర్యంలో గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు పోరెడ్డి విశ్వనాథ మాట్లాడుతూ ఈ నెల 25న జరగబోయే మహాసభకు సిఐటియు జిల్లా నాయకులు, భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా నాయకులు హాజరై ప్రసంగిస్తారన్నారు. ఆ రోజున కార్మికులంతరూ పనులు బంద్ చేసి ఈ మహాసభలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎ ఆదినారాయణ, బొద్దేపు గౌరు నాయుడు, మరడాన త్రినాధరావు, కాబోతుల గౌరు నాయుడు, సిర్ది రాము తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్‌లో సరైన అడుగులు వేయాలి

**నెల్లిమర్ల:** విద్యార్థులకు ఇంటర్మీడియట్ చాలా కీలకమైనదని ఈ దశలోనే సరైన అడుగులు వేయడం ద్వారా భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగగలరని అవకాశం ఉంటుందని రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి అన్నారు. గురువారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో శ్రీనిధి జూనియర్ కళాశాల విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పై అవగాహన కల్పించారు. భవిష్యత్తుకు సంబంధించి ఎలాంటి అవకాశాలు ఉన్నాయో వివరించారు. ఎక్స్పొఎన్ డీన్ ప్రొఫెసర్ పిఎస్‌వి రమణారావు సెంచూరియన్‌లో విద్యనభ్యసించేవారికి ఎలాంటి అవకాశాలు ఉంటాయో వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక ఎజిఎం చిరంజీవి, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

# తీరం సుందరం... స్నానానికి ప్రమాదం

● సౌకర్యాల కల్పనలో యంత్రాంగం విఫలం ● చింతపల్లి తీరానికి పెరుగుతున్న పర్యాటకుల తాకిడి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని చింతపల్లి సముద్రం తీరం చూసేందుకు సుందరంగా ఉంటుంది. కానీ అక్కడ ప్రభుత్వ యంత్రాంగం ఎటువంటి సౌకర్యాలూ కల్పించకపోవడం వల్ల స్నానానికి అనువుగా ఉండటం లేదు. ఒక్కోసారి ఇది చాలా ప్రమాదకరంగా మారుతోంది. సముద్రం ఒడ్డంతా ఏటవాలుగా ఉండడంతో అండర్ కరెంట్ పాస్ అవుతోందని నిపుణులు చెబుతున్నారు. సముద్రంలో ఒడ్డు నుండి కొంత దూరం వెల్లగానే నీటి అడుగున రాళ్ల గుట్టలు ఉన్నాయి. వాటి ద్వారా అటుపోటులు సమయంలో కెరటాలు ఉధృతంగా మారి అండర్ కరెంట్ పాసయ్యే అవకాశం ఉన్నట్లు మెరైన్ పోలీసులు చెబుతున్నారు. దాన్ని పర్యాటకులు గుర్తించకుండా స్నానాల కోసం పది మీటర్లు లోపలకు వెళ్లిపోతున్నారు. దీంతో ప్రమాదం సంబవించే అవకాశం ఎక్కువగా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కార్తిక మాసం సందర్భంగా చింతపల్లి తీరానికి సముద్రం స్నానం నిమిత్తం వేలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉంది. కొంత మంది స్నానం కోసం సముద్రం లోపలకు వెళ్లి పోతున్నారు. కొంత దూరం వెల్లేంతవరకూ మెట్టుగానే అనిపిస్తున్న అడుగున రాళ్ళ

ఇదే ప్రమాదకర చింతపల్లి తీరం

ఉండడంతో ఒక్కసారిగా కెరటాలు వచ్చేసరికి అండర్ కరెంట్ పాస్ అయ్యే అవకాశం ఉంది. దాంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. పర్యాటకులు సముద్ర స్నానాలు చేసే ముందు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

### తీరంలో పటిష్ట బందోబస్తు

కార్తికమాసం దృష్టిలో పెట్టుకొని చింతపల్లి తీరంలో పటిష్ట బందొబస్తు ఏర్పాటు చేశారు. మెరైన్ సిఐ. కె. వైకుంటరావు, ఎస్ఐలు శ్రీనువాస్, రమేష్‌తో పాటు ఎఎస్ఐ, మెరైన్ పోలీసులతో పాటు పూసపాటిరేగ లాండ్ ఆర్డర్ ఎస్ఐ. బాలకృష్ణ, సిబ్బదితో కలిసి పటిష్టమైన బందోబస్ట్ ఏర్పాటు చేశారు. సముద్ర స్నానాలు జరిగే సమయంలో ఎటువంటి ఆవాంచనీయ సంఘటనలూ జరగకుండా సముద్రం నీళ్లలోనే మెరైన్ గార్డులు ఉండేలా చర్యలు తీసుకున్నారు. లైఫ్ జాకెట్లు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నారు. ప్రమాదం స్థలాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. చింతపల్లి తీరంలో ఉండే జట్టీపైకి ఎక్కడం నిషేదించారు.

### సముద్ర స్నానానికి అనుకూలం

చింతపల్లి తీరంలో సముద్ర స్నానానికి అనుకూలం. సముద్రం ఒడ్డునుండి కొన్ని మీటర్లు లోపలకి వెళ్లేంతవరకూ మెట్టుగా ఉన్నా అది ప్రమాద స్థలం. సముద్రం నీళ్ల అడుగున పదునైన రాళ్ల ఉన్నాయి. అక్కడ ఒక్కసారిగా అలలు పెరిగి అండర్ కరెంట్ పాసయ్యే అవకాశం ఉంది. అందుకే స్నానం చేసేవారు అప్రమత్తంగా ఉండాలి.

**- కె. వైకుంఠరావు, మెరైన్ సిఐ. చింతపల్లి పూసపాటిరేగ మండలం**

## రక్తదానం సామాజిక బాధ్యత

**విజయనగరం టౌన్:** యువత అపోహలు వీడి రక్తదానం సామాజిక బాధ్యతగా ముందుకు రావాలని ప్రముఖ చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఎం.వెంకటేశ్వరావు తెలిపారు. గురువారం రోటరీ బ్లడ్ బ్యాంక్, వెంకటపద్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో రక్తదానంపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. యువతలో ఉన్న అనేక అపోహలు వల్ల రక్తదానానికి ముందుకు రావడం లేదన్నారు. యువత రక్తదానం సామాజిక బాధ్యతగా తీసుకొని ముందుకు వస్తే ఎన్నో ప్రాణాలు నిలబెట్టవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ కార్యదర్శి మంద రవికుమార్, ప్రవీణ్ కుమార్ అంచాలియా, అబ్దుల్ రవూఫ్, అధ్యాపకులు, పాల్గొన్నారు.

## బాల్య వివాహాలను అరికట్టాలి

**విజయనగరం టౌన్:** బాల్య వివాహాలను అరికట్టాలని సామాజిక, పరివర్తన మార్పు సమాచార వ్యవస్థ జిల్లా సమన్వయాధికారి బి.రామకృష్ణ పిలుపునిచ్చారు. గురువారం గుంకలాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, రక్తహీనత, పౌష్టికాహారం, జంక్ ఫుడ్ వల్ల ప్రమాదాలు, చేతుల పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. హెచ్ఎం.శ్రీనివాసరావు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# మళ్లీ తవ్వేస్తున్నారు..

● గడసాం, చినకాద కొండపై రాబందులు
● ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి- దత్తిరాజేరు

మండలంలోని గడసాం, చినకాద గ్రామాల మధ్యన ఉన్న కొండను మళ్లీ అక్రమార్కులు ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. అక్కడ తవ్వకాలను ఆపాలని డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి నాయుడు గతంలో కలెక్టర్‌కు, తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో తవ్వకాలను ఆపినట్టే ఆపి బుధవారం మళ్లీ ప్రారంభించారు. తవ్వకాలను వెంటనే ఆపాలని, అక్రమార్కులపై తగు చర్యలు తీసుకోవాలని స్థానిక తహశీల్దార్ రమేష్‌ను కోరగా దానిని ఆపడం మా పని కాదని మాకు సంబంధం లేదని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. గనులు భూగర్భ శాఖ అధికారులకు తెలియజేసినా ఎటువంటి స్పందనా లేదని డివైఎఫ్ఐ నాయకులు చెబుతున్నారు. వాస్తవానికి ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన కొండలను రక్షించాల్సిన బాధ్యత అధికారులదే. అలాంటిది ఇటువంటి వాటిపై చర్యలు తీసుకోవడానికి

గ్రావెల్ తరలింపునకు సిద్ధంగా ఉన్న లారీలు

వెనుకాడుతున్నారంటే ఏ స్థాయిలో ముడుపులు అందాయో ఇట్టే అర్థం చేసుకోవచ్చును. ఇటువంటి అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై మైనింగ్ అధికారి త్రినాథ్ రెడ్డిని వివరణ కోరగా గజపతినగరం మండలం మరుపల్లి క్వారీకి అనుమతి ఇచ్చామని గడసాం, చినకాద గ్రామాల మధ్య రోడ్డుకి తాము అనుమతి ఇవ్వలేదని అన్నారు.

# పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - వేపాడ

స్థానిక శాఖా గ్రంథాలయానికి టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ పుస్తకాలను గురువారం వితరణగా అందించారు. యువతకు ఉపయోగపడే గ్రూప్-1, గ్రూప్-2 (1 సెట్)' కానిస్టేబుల్ (1 సెట్)' డిఎస్‌సి (1 సెట్) పోటీ పరీక్షలో ఉపయోగపడే రూ. 15వేలు విలువ చేసే 20 పుస్తకాలను అందించారు. అనంతరం గొంప కృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల కష్టపడి చదివితే తప్ప ఈ రోజుల్లో యువతకు ఉపాధి కలగడం కష్టమన్నారు. మీరంతా ఈ బుక్స్ చదివి మంచి ప్రయోజకులుగా ఎదగాలని మనస్ఫూర్తిగా కోరుతున్నామన్నారు. గ్రంథాలయానికి వచ్చే యువతకు పోటీ పరీక్షల్లో ఉపయోగపడే బుక్స్ ఇచ్చినందుకు గ్రంథాలయ అధికారి సోమనాయుడు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ కోట టిడిపి మహిళా అధ్యక్షులు గుమ్మడి భారతి, బానాది ఎంపిటిసి గొంప తులసి, మండల తెలుగు యువత అధ్యక్షుడు ముక్క రామకృష్ణ, మండల ఐటిడిపి

పుస్తకాలను పంపిణీ చేస్తున్న గొంప కృష్ణ

అధ్యక్షుడు సేనాపతి గణేష్, మండల తెలుగు యువత అధ్యక్షుడు సిరికి రమణ, నాయకులు గొర్రె నాగరాజు, మంచిని అప్పలసూరి, గొర్రుపోటు వెంకటరమణ పాల్గొన్నారు.

### బాబా కార్యక్రమాలకు హాజరు

మండలంలో బానాది, బల్లంకి గ్రామాలలో నిర్వహించిన సత్య సాయి బాబా కార్యక్రమాలలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి గొంప కృష్ణ పాల్గొని ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, టిడిపి పార్టీ సీనియర్ నాయకులు నాగరాజు, అప్పల సూరి, శిరికి రమణ, టి. కృష్ణ పాల్గొన్నారు.

# మహాధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

విజయవాడ మహా ధర్నాను జయప్రదం చేయాలని వామ పక్ష ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం జరజాపు పేటలో అమర వీరుల స్మారక స్థూపం వద్ద మహాధర్నా గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వామపక్ష ప్రజా సంఘాల నాయకులు కిల్లంపల్లి రామారావు, కాళ్ళ అప్పల సూరి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 27,28 తేదీల్లో జరగ నున్న మహాధర్నా జయప్రదం చేయాలని కోరారు. ముఖ్యంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక కర్షక, సామాన్య ప్రజలకు వ్యతిరేకంగా పలు విధానాలు అమలు చేస్తుందన్నారు. **విజయనగరం టౌన్:** కార్మిక, కర్షక, వ్యవసాయ కూలీల, కౌలు రైతుల సమస్యలపై విజయవాడ జింఖానా స్టేడియంలో ఈనెల 27 ,28 తేదీల్లో జరిగే మహా ధర్నాను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ. జగన్మోహన్ రావు పిలుపునిచ్చారు. గురువారం ఆటో కార్మికుల్లో, జిసిసి సోప్ యూనిట్ వద్ద కరపత్ర ప్రచారం నిర్వహించి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి విధానాల వల్ల ధరలు పెరిగి ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని, కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడంలేదని, రైతులు పండించే పంటకు గిట్టుబాటు ధర లేదని, వర్షాలు లేక పంటలు పండక కౌలు రైతులు అప్పుల పాలై దివాలా తీస్తున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో సమస్యల పరిష్కారానికి నిర్వహించే ధర్నాలో ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు రమణ, జిసిసి సోప్ యూనియన్ నాయకులు సుజాత, సూర్యనారాయణ, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు

## వంద రోజులు పని కల్పించాలి

ప్రజాశక్తి- తెర్లాం

పనికి వచ్చే ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలని రాజాం క్లస్టర్ ఎపిడి మీసాల శ్రీనివాసరావు ఆదేశించారు. గురువారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఆర్థిక సంవత్సరానికి ప్రతి ఒక్క పంచాయతీ లో వ్యక్తిగత పనులను గుర్తించి, అంచనాలు తయారు చేయాలన్నారు. రైతుల మెట్టు భూముల్లో ఉద్యాన వనాలు వేయించాలన్నారు. అన్ని రికార్డులు సక్రమంగా నిర్వహించా లన్నారు. జాబ్ కార్డ్స్ అప్డేట్ చేయాలని ఆదేశించారు. డిసెంబర్ మొదటి వారంలో సెంట్రల్ టీం జిల్లాకు వస్తుందని ప్రతి ఒక్కరూ వర్క్ ఫైల్స్ సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎపిఒ కోట సుశీల, ఈసీ శంబంగి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల ఆకస్మిక పరిశీలన

ప్రజాశక్తి - పూసపాటిరేగ

విద్యార్థుల సామర్థ్యాలు, ఉపాధ్యాయుల పనితీరుపై విద్యాశాఖాధికారులు గురువారం మండలంలో పలు పాఠశాలలో ఆకస్మిక పరిశీలన చేశారు. జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు రెండు బృందాలు ఈ పరిశీలనలో పాల్గొన్నాయి. ఇందులో పాఠశాలలోని ప్రతి విద్యార్థిని యొక్క తరగతుల వారిగా తెలుగు, ఆంగ్ల భాషలు, గణిత అంశాలలోని సామర్థ్యాలను నిశితంగా పరిశీలించారు. విద్యార్థుల పాఠ్యపుస్తకాలు, సాధన పుస్తకాలు రాసే విధానాన్ని వాటిని ఉపాధ్యాయులు పరిశీలించి సరిదిద్దుతున్న తీరును కూడా పరిశీలన బృందం పరిశీలించింది. ఈ అంశాల ఆధారంగా విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, పాఠశాలకు గ్రేడులు ఇవ్వనున్నట్లు వారు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలను చేశారు. మండల విద్యశాఖాధికారి బి. పాపినాయుడు, భోగాపురం మోడల్ స్కూల్ ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ బి. ధుర్గాప్రసాద్ బృందం స్థానిక ప్రాథమిక పాఠశాలతో పాటు లంకలపల్లి పాలెం ప్రాథమిక పాఠశాలను సందర్శించగా గజపతినగరం మండల విద్యాశాఖాధికారి బి. సాయి చక్రధర్, డెంకాడ మండలం మోపాడ ఉన్నత

పిల్లల సామర్థ్యాలను పరిశీలిస్తున్న బృంద సభ్యులు

పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్. నాగ్ కుమార్ బృందం రెల్లివలస-1, బొర్రవానిపాలెం ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. మండలంలో అన్ని పాఠశాలల్లోనూ ఈ ఆకస్మిక పరిశీలనలు కొనసాగుతాయని అధికారులు తెలియజేశారు.

**వేపాడ:** మండలంలోని గుడివాడ ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాశాఖకు సంబంధించిన బృందం గురువారం పరిశీలించింది.ఉపాధ్యాయులు ఇంతవరకు బోధించిన విధానంపై ఆరా తీశారు. విద్యార్థులను పాఠాలు చదివించడం, వర్క్ బుక్కులు పరిశీలన చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ పరిశీలనలో సిఆర్‌పి కాటేపల్లి రాంప్రసాద్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## భవిష్యత్తుకు గ్యారెంటీ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని రేవళ్లపాలెంలో టిడిపి మండల అధ్యక్షుడు జీ.ఎస్.నాయుడు ఆధ్వర్యంలో యూనిట్ ఇంఛార్జ్ గొల్లు నారాయణ మూర్తి, బూత్ కన్వీనర్ మేడిశెట్టి రామునాయుడు సారథ్యంలో గురువారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కోళ్ల లలిత కుమారి పాల్గొని భవిష్యత్తుకు గ్యారెంటీ బాండ్లను ఇంటింటికీ పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాబోయే టిడిపి ప్రభుత్వంలో ఆడబిడ్డ నిధి కింద 18 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళకూ నెలకు రూ.1500, తల్లికి వందనం పథకం కింద ప్రతి ఇంట్లో ఎంతమంది పిల్లలు చదివితే అంతమందికి ఏడాదికి రూ.15వేలు ఖాతాల్లో జమ చేస్తామన్నారు. దీపం పథకం కింద ప్రతీ కుటుంబానికి ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు, ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం, ప్రతి ఇంటికి కుళాయి ద్వారా సురక్షిత మంచినీటి సరఫరా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పైడితల్లినాయుడు, మాజీ సర్పంచ్ అప్పలరాము, నాయుడు, రేవళ్ళపాలెం టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'బాలల సైన్స్'లో ధర్మవరం విద్యార్థి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బోజంకి భరత్, గైడ్ టీచర్ పి. శివాజీ సహకారంతో 31వ బాలల జాతీయ సైన్స్ కాంగ్రెస్‌లో పాల్గొని రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. భవన నిర్మాణంలో ఇసుకకు ప్రత్యామ్నాయంగా వాడి పడేసిన టి, కాఫీ పౌడర్లను వినియోగించవచ్చు అని రుజువు చేసే ప్రాజెక్టుకును ప్రదర్శించాడు. దీనికి తహశీల్దార్ డి. శ్రీనివాసరావు భరత్‌ను గురువారం అభినందించారు. వ్యర్థ పదార్థాలైన టీ కాఫీ పౌడర్లను ఇసుకకు బదులుగా వినియోగించిన తీరు అభినందనీయం అన్నారు. వ్యర్థ పదార్థాలను వినియోగించడం వలన పరిసరాలు పరిశుభ్రంగా ఉండటమే కాకుండా ఎంతో విలువైన నదీతీర ప్రాంతాలు ప్రకృతి వనరులు కాపాడబడతాయని చెప్పారు. ఈ విధానం భావితరాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆకాంక్షించారు. ఎంపిడిఒ కే.శేషు బాబు ఈ ప్రాజెక్టు రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఎంపిపి ఎస్ సోమేశ్వరరావు ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు బి. నరసింగరావు, గణపతి లక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బంగారు మహేశ్వర రావు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు, జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ పాల్గొన్నారు.

## వైసిపి సీనియర్ నాయకుడు మృతి

ప్రజాశక్తి- డెంకాడ

రామునాయుడు(ఫైల్)

మండలంలోని కొండరాజుపేట గ్రామానికి చెందిన సీనియర్ వైసిపి నాయకులు పిన్నింటి రామునాయుడు (70) బుధవారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందారు. విజయనగరం వెళ్లొచ్చి ఇంటి దగ్గర కుర్చీలో కూర్చొని ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే సపర్యలు చేసినా ఐదు నిమిషాల వ్యవధిలోనే చనిపోయాడు. రామునాయుడుకు నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఐదుగురు పిల్లలకూ వివాహాలు చేసేశాడు. ఆయన మొదటి నుంచీ స్వర్గీయ కొమ్మూరు సంజీవరావు, పి సాంబశివరాజు దగ్గర కాంగ్రెస్ పార్టీలో పని చేశారు. రాజుల సంస్థానంలో సాంబశివరాజు, అశోక్ గజపతిరాజు కుటుంబ సభ్యుల వద్ద ఇతని తాత, తండ్రులు బిల్ల బంట్రోతులుగా పనిచేశారు. ఆ తరువాత ఈయన కూడా బిల్ల బంట్రోతుగా పనిచేశారు. రామునాయుడు మరణ వార్త తెలిసిన వెంటనే నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, గ్రామ సర్పంచ్ సరిగడ బంగారు రెడ్డి, గ్రామ నాయకులు డి వెంకటరెడ్డి, పలువురు సర్పంచులు వైసిపి నాయకులు, ఎంపిటిసిలు తదితరులు సంతాపం తెలిపి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుబూతిని తెలిపారు.

**IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE COURT:: VIZIANAGARAM**
**I.P..No.22/2023**

Between:
Battula Vijaya Kumari W/o.late Gopala Rao Hindu, aged about 56 years, R/o.D.No.15-10-25, Konisi Veedhi, Vizianagaram ... Petitioner
And:
N.Narayanamma & 12 others ....Respondents
TO

1. N.Narayanamma, W/o.late Narayana Rao, Hindu, aged about 55 years, R/o.Konisi Veedhi, Near Rama Temple, Vizianagaram
2. N.Sravani, W/o.Gowri Sankar, Hindu, aged about 35 years, R/o. Konisi Veedhi, Besides Narayanamma House, Vizianagaram
3. P.Divya, W/o.Suribabu, Hindu, aged about 52 years, R/o.Om Mandir Road, Opp: Rama Temple, RCC Slabbed House 1st Floor, Vizianagaram
4. Chelluru Bujji, W/o.Mahesh, Hindu, aged about 38 years, R/o.Chelluru Village, 2nd Lane, Dharmapuri Taluk, Vizianagaram Dist.
5. Potti Bujjamma, W/o.Venkata Raju, Hindu, aged about 48 years, R/o.Konisi Veedhi, Near Rama Temple, Vizianagaram
6. N.Raju, sister of Narayanamma, Hindu, aged about 50 years, R/o.Telakala Veedhi, RCC Slabbed House, 1st Floor, Opp: 2481/A71E/C, Vizianagaram
7. M.Latha, W/o.Suri, Hindu, aged about 32 years, R/o.House No.144, LIG Oppl MC Park Kata Veedhi.
8. N.Ratnam, W/o.late Subbarao, Hindu, aged about 60 years, Retd. Teacher, R/o.Budi Veedhi, Door No.21-4-22, Vizianagaram.
9. K.Suribabu, S/o. not known, Hindu, aged about 52 years, Maintenance a Hotel, R/o.Gowdu Veedhi, Vizianagaram.
10. Yamavarapu Usha, W/o. Prasad (Driver) Hindu, aged about 28 years, R/o.House No.169, YSR Nagar, Vizianagaram.
11. Kanakala Kalyani, W/o.K.Ramarao, Hindu, aged about 35 years, R/o.The old Cinema Theatre, Maddi Village, Visakhapatnam Dist.
12. K.Lalitha, W/o.Sai, Hindu, aged about 30 years, R/o.House No.169, YSR Nagar, Vizianagaram.
13. K.Kanchana, W/o.not known, Hindu, aged about 56 years, R/o.Babametta, Vizianagaram.

**PUBLIC NOTICE**

Please take notice that my client Battula Vijaya Kumari filed the above insolvency petition against the above said 13 respondents seeking of declaration to declare that she is insolvent before the Honourable Principal Senior Civil Judge, Vizianagaram. If any public having any objection in the above matter they may approach the above said Honourable Court on or before **30-11-2023 at 10.30 AM** as the above matter posted to that date. If any person not expressed any objection in the above matter, the matter will be decided as per law.

**K.PHALGUNA RAO**
**GADULA SEKHAR**
Advocates & Ex-Govt. Pleader
Flat No.103, Uma Plaza,
Elugubantivari Veedhi,
Vizianagaram Town & Mandal.
Cell No 9908678408

VIZIANAGARAM
Dt.23-11-2023

# వైసిపికి మరోసారి అవకాశమివ్వండి

ప్రజాశక్తి- డెంకాడ

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, వైసిపి ప్రభుత్వానికి మరోసారి అవకాశం ఇవ్వాలని ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు కోరారు. జగనే రాష్ట్రానికి ఎందుకు కావాలి కార్యక్రమం మండలంలోని అమకాం గ్రామంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చారన్నారు. అనంతరం సంక్షేమ డిసిప్లే బోర్డును ప్రారంభించి వైసిపి జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ డిడి స్వరూప రాణి, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మి నాయుడు, సర్పంచ్ బి అప్పారావు, ఎంపిటిసి లు, నాయకులు కోటి, ధర్మ, ఆనంద్, వినోద్, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: మాట్లాడుతున్న ఎంపిపి సత్యవంతుడు

**వేపాడ:** మండలంలోని వీలుపర్తిలో ఎపికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఎంపిపి డి సత్య వంతుడు మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో లేని విధంగా సంక్షేమ పథకాలు అవినీతి రహితంగా నేరుగా ప్రజలకి అందజేస్తున్న జగన్మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమం సర్పంచ్ సేనాపతి లీల, ఇఒపిఆర్‌డి ఉమా, పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి, వైసిపి నాయకులు సత్యం నాయుడు, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

**నెల్లిమర్ల:** మండలంలోని కొండవెలగాడలో సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ఎంపిపి అంబళ్ల సుధారాణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపిపి అర్హులైన వారిని గుర్తించి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేస్తుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరాలు అర్హులు తెలుసుకోవడానికి డిజిటల్ బోర్డుల రూపంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యులు అంబళ్ళ శ్రీ రాములు నాయుడు, జడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, వైసిపి సీనియర్ నాయకులు దంతలూరి జోగి జగన్నాథ రాజు, ఎంపిడిఒ జి. రామారావు, ఇఒపిఆర్‌డి కె. సింహాద్రి, మండల స్థాయి అధికారులు, పాల్గొన్నారు.

**భోగాపురం:** అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు



భోగాపురం: సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న సూర్యనారాయణరెడ్డి

అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి అన్నారు. మండలంలోని కౌలువాడ సచివాలయం పరిధిలో ఆంధ్రకి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం గురువారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో, పథకాలు అందించడంలో జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. అనంతరం గ్రామంలో పార్టీ జెండాను, పథకాలు తెలిపే డిస్ ప్లే బోర్డుని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అప్పలనాయుడు, నాయకులు గాలి రాజారెడ్డి, కోరాడ అప్పన్న తదితరులు పాల్గొన్నారు.